



# DD9 వార్త
తెలుగు దినపత్రిక

## 'కల్కి 2' షూటింగ్ స్టార్ట్.. రెబలోడు సెట్స్ లో ఎప్పుడు అడుగుపెడుతున్నాడంటే?



5

సంపుటి : 02 సంచిక : 272 హైదరాబాద్, మే, శనివారం 02, 2026 పేజీలు : 06 వెల : 3.00

# కాంగ్రెస్ కూల్చివేతలు.. కేంద్రం బాదుడు

### మే డే వేడుకల్లో కేటీఆర్ తీవ్ర విమర్శలు

రిటైర్డ్ ఉద్యోగులు వరద బాధితులా?
ప్రభుత్వ వైఖరిపై నిలదీసిన కేటీఆర్
రాష్ట్రంలో 120 మంది
ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు
సర్కార్ మౌనం దారుణమని ఆగ్రహం
వాణిజ్య సిలిండర్‌పై రూ. 1000 పెంపు
కార్మికులకు మోదీ ఇచ్చిన 'కానుక'
వలస కార్మికుల ఇళ్లపై
బుల్డోజర్లు పంపిస్తున్న రేవంత్
ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే
ఎస్సెల్బీసీ సొరంగం ప్రమాదం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో ప్రస్తుతం కార్మిక వ్యతిరేక పాలన సాగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ అటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఇటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ హయాంలో కార్మిక, ఉద్యోగ మిత్ర సర్కార్‌గా ఉన్న తెలంగాణ.. నేడు కాంగ్రెస్ హయాంలో వారిని వేధించే అడ్డాగా మారిందని మండిపడ్డారు.

**ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది కాంగ్రెస్ బాధితులు**
రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ..మిగతా 2లో

## గ్యాస్ ధరల పెంపు దుర్మార్గపు నిర్ణయం

కేంద్రంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం
కమర్షియల్ సిలిండర్‌పై రూ.993 భారం
సుమారు వెయ్యి రూపాయల పెంపు అన్యాయం
చిన్న వ్యాపారులు, హోటళ్లపై కోలుకోలేని దెబ్బ
ఒకేసారి 35 శాతం పెరిగిన భారం ఎన్నికలు
ముగియగానే అసలు రంగు బయటపడింది
కేంద్రానికి రాజకీయ కుతంత్రమంటూ విమర్శలు
ఢిల్లీలో రూ. 3,000 మార్కును దాటిన గ్యాస్ ధర
తక్షణమే ఉపసంహరించుకోవాలని
తెలంగాణ డిమాండ్
నిత్యావసరాల ధరలు పెరిగే
ప్రమాదం ఉందన్న ఆర్థిక నిపుణులు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం అనుసరిస్తున్న తీరు సామాన్యుడి నడ్డి విరిచేలా ఉందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పేదల ప్రయోజనాలను గాలికొదిలేసి, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని ఆయన విమర్శించారు. గ్యాస్ ధరల పెంపుతో సామాన్యుడి బతుకు భారంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**సామాన్యుడిపై కనికరం లేని కేంద్రం**
వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ. 993 పెంచడం ద్వారా కేంద్రం తన క్రూరత్వాన్ని చాటుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఒకేసారి గ్యాస్ ధరను సుమారు వెయ్యి రూపాయలు పెంచడం వల్ల చిరు వ్యాపారులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు మాత్రమే కాకుండా వీధి చివర బండి పెట్టుకుని బతికే చిరు వ్యాపారుల వంటగదుల్లో కూడా మంటలు పుడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెంపు కేవలం గ్యాస్‌కే పరిమితం కాదని, దీని వల్ల ఆహార పదార్థాల ధరలు పెరిగి అంతిమంగా సామాన్య ప్రజల జేబులకు చిల్లు పడుతుందని ఆయన హెచ్చరించారు.

**ఎన్నికల వ్యూహం బయటపడింది**
కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరల పెంపు విషయంలో అనుసరిస్తున్న రాజకీయ క్రమశిక్షణను ఉత్తమ్ ఎండగట్టారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన కేవలం 24 గంటల్లోనే ఈ భారీ పెంపును ప్రకటించడం వెనుక ఉన్న కుట్రను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఓట్ల కోసం ధరలను నియంత్రించి, ఎన్నికలు అయిపోగానే ప్రజలపై భారం మోపడం మోదీ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ప్రజలను మభ్యపెట్టి ..మిగతా 2లో

## ఆర్టీసీ కార్మికులకు సీఎం 'మే డే' కానుక



సమ్మె కాలపు వేతనాలు, కేసుల రద్దుకు గ్రీన్ సిగ్నల్
సంస్థ బలోపేతమే లక్ష్యమన్న సీఎం రేవంత్ రెడ్డి
సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన 14 ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు
సమ్మె కాలపు 3 రోజుల జీతం చెల్లింపునకు ముఖ్యమంత్రి అంగీకారం
కార్మికులపై ఉన్న పాత కేసులన్నీ ఎత్తివేయాలని అధికారులకు ఆదేశం
శంషాబాద్‌లో 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టర్మినల్
ఆర్టీసీకి మరో రూ. 1000 కోట్ల బకాయిల విడుదల చేస్తామన్న సీఎం
1000 కొత్త ఈవీ బస్సుల కొనుగోలు.. మెట్రోతో అనుసంధానం
మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.8 వేల కోట్ల భరోసా
డ్రైవర్ల కోత ఉండదు.. ఈవీ బస్సులతో డీజిల్ ఖర్చుకు చెక్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సుదీర్ఘ కాలపు నిరీక్షణకు తెరదించుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో 14 ప్రధాన కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం.. గతంలో మూడు రోజుల పాటు జరిగిన సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను విడుదల చేయాలని, అలాగే కార్మికులపై ఉన్న పోలీసు కేసులను తక్షణమే ఎత్తివేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల కార్మిక లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

**నేను వేరు.. మీరు వేరు కాదు: ముఖ్యమంత్రి**
ఆర్టీసీ కార్మిక సంఘాలతో జరిగిన భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆత్మీయంగా మాట్లాడారు. "నేను వేరు, మీరు వేరు అన్న భావన నాకు ఎప్పుడూ లేదు. అందరం కలిస్తేనే ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నారు, మీ పోరాటాల్లో మేము కూడా భాగస్వామ్యం అయ్యాం" అని గుర్తుచేశారు. కార్మికుల పట్టుదల వల్లే ఆర్టీసీ నేడు దేశంలోనే అగ్రగామి సంస్థగా ..మిగతా 2లో

## శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

తెలంగాణ కొత్త డీజీపీ సీవీ ఆనంద్
బాధ్యతల స్వీకరించిన పోలీస్ బాస్
టెక్నాలజీతో నేరగాళ్లకు చెక్
పోలీసింగ్‌లో ఆధునిక పోకడలు
డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం
'ఈగల్ టీమ్స్' సేవలు విస్తృతం
ఫోన్ ట్యాపింగ్ కేసు
విచారణపై కీలక వ్యాఖ్యలు
మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో
సాహసోపేతమైన ఆపరేషన్లు
ట్రాఫిక్ సంస్కరణలు,
షీ టీమ్స్ ఏర్పాటులో అగ్రగామి



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తానని, మారుతున్న నేరాల ..మిగతా 2లో

## కవిత వల్లే కేసీఆర్ మళ్లీ మేల్కొంటున్నారు

చెరువులను కబ్జాల నుంచి విముక్తి
చేస్తే కేసీఆర్ కు వచ్చిన ఇబ్బంది
ఏమిటన్న మహేశ్
హైడ్రా నిబంధనలను కేసీఆర్
చదువుకోవాలని హితవు
రాజకీయ ఉనికి కోసమే కేసీఆర్
బయటకు వస్తున్నారని ఎద్దేవా
త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ
ఉంటుందని వెల్లడి
మంత్రివర్గ విస్తరణపై సీఎం నిర్ణయం
తీసుకుంటారన్న పీసీసీ చీఫ్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని చెరువుల కబ్జాల విముక్తి కోసం ప్రభుత్వం చేపట్టిన హైడ్రా చర్యలపై కేసీఆర్ అభ్యంతరం చెప్పడాన్ని పీసీసీ చీఫ్ తప్పుపట్టారు. నగరం చుట్టూ ఉన్న చెరువులను బీఆర్ఎస్ నాయకులే కబ్జా చేశారని, అందుకే హైడ్రా వల్ల ఆ పార్టీ నేతలకు ఇబ్బంది కలుగుతోందని ..మిగతా 2లో

## అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా గుట్టు రట్టు

ముంబయిలో రూ.1,745 కోట్ల కొకైన్ సీజ్
అంతర్జాతీయ
ముఠాను పట్టుకున్నఎన్‌సీబీ
'బాటమ్-టు-టాప్' విధానం సక్సెస్
ఎన్‌సీబీ బృందంపై
అమిత్ షా ప్రశంసల జల్లు
తుర్కియే నుంచి భారత్‌కు దావూద్
అనుచరుడు సలీం డోలా తరలింపు
'ఆపరేషన్ గ్లోబల్ హంట్'
ద్వారా మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ అరెస్ట్
డ్రగ్ కింగ్‌పిన్‌లకు
హోం మంత్రి అమిత్ షా హెచ్చరిక



2

## తెలంగాణ రక్షణ సేనలోకి మాజీ మంత్రి..

కవితతో భేటీ.. టీఆర్ఎస్‌లో
చేరికకు సంకేతాలు
త్వరలోనే అధికారిక
చేరికకు సిద్ధం
సింగరేణి ప్రాంతంలో
పార్టీ బలోపేతంపై దృష్టి
సీనియర్ నేత రాకతో
టీఆర్ఎస్‌కు కొత్త జోష్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్దన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన త్వరలోనే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరబోతున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. త్వరలోనే తన అనుచరులతో కలిసి అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు బోడ జనార్దన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ..మిగతా 2లో



# గ్యాస్ ధరల పెంపు దుర్మార్గపు నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి**



అధికారం పొంది, ఆపై వారిపైనే ఆర్థిక దాడి చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని ఆయన అభివర్ణించారు.

**చిరు వ్యాపారుల కుదేలు**

ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం ధర పెరగడంతో వ్యాపార నిర్వహణ అత్యంత భారంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపులు నడుపుకునే వారు తమ ధరలను పెంచక తప్పదని, ఇది సామాన్యుల ఆహార అలవాట్లపై కూడా ప్రభావం చూపుతుందని చెప్పారు. మోదీ ప్రభుత్వం సామాన్యుల జీవన ప్రమాణాలను పెంచాల్సింది పోయి, ఉన్న ప్రమాణాలను తగ్గించేలా నిర్ణయాలు తీసుకోవడం శోచనీయమని ఉత్తమ్ మండిపడ్డారు. కేంద్రం జారీ చేసిన ఈ ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో సిలిండర్ ధర రూ. 3071 దాటిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ ధరల పెంపు నిర్ణయంపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడాలని, ప్రజల పక్షాన కేంద్రం మెడలు వంచాలని ఆయన పిలుపునిచ్చారు. పేదల వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న బీజేపీకి త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని ఉత్తమ్ హెచ్చరించారు.

# కవిత వల్లే కేసీఆర్ మళ్లీ మేల్కొంటున్నారు

**మొదటిపేజీ తరువాయి**



తీరుకు అనుగుణంగా సరికొత్త సాంకేతికతను వాడుకుంటూ నేరగాళ్లకు చెక్ ఎద్దేవా చేశారు. చెరువులను కబ్జాల నుండి విముక్తి చేస్తే కేసీఆర్ కి వచ్చిన ఇబ్బంది ఏంటని ఆయన నిలదీశారు. హైడ్రా నిబంధనల గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవు పలికారు.

టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కవిత వల్లే కేసీఆర్ మళ్లీ మేల్కొంటున్నారని, ఆమె భయం వల్లే ఆయన బయటకు వస్తున్నారని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కవితకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ ప్రజల కోసం కాకుండా రాజకీయ ఉనికి కోసమే బయటకు వస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేస్తున్నామని చెబుతూనే, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా మహేశ్ గౌడ్ కొన్ని కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని, దీనిపై ఇప్పటికే కసరత్తు పూర్తయిందని తెలిపారు. ఇక అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం తీసుకునే అధికారం పూర్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని ఆయన స్పష్టం చేశారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

**మొదటిపేజీ తరువాయి**



పెడతామని స్పష్టం చేశారు.

**సాంకేతిక సవాళ్లు - పోలీసుల వ్యూహాలు**

నేరగాళ్లు కొత్త కొత్త టెక్నాలజీని వాడుతూ మోసాలకు పాల్పడుతున్నారని, ఇది పోలీసులకు ఒక సవాలుగా మారిందని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. "నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే దేశంలోనే మేటిగా ఉన్నారు. అయితే నేరగాళ్ల ఎత్తుగడలు మారుతున్నాయి. అందుకే శాంతిభద్రతల సమస్య తలెత్తక ముందే అప్రమత్తంగా ఉండే వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం" అని ఆయన అన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

**మాదకద్రవ్యాల ముఠాలపై ఉక్కుపాదం**

రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డీజీపీ తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా మాదకద్రవ్యాల ముఠాలు కొత్త దారులు వెతుకుతున్నాయని, వీటిని అణచివేసేందుకు 'ఈగల్ టీమ్స్' అద్భుతమైన కృషి చేస్తున్నాయని కొనియాడారు. డ్రగ్స్ సప్లయ్ చైన్‌ను దెబ్బతీయడంతో పాటు, యువత ఈ వ్యసనాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు కూడా చేపడతామని ఆయన వివరించారు.

**ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందడుగు**

సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ప్రస్తుతం తుది దశకు చేరుకుందని డీజీపీ వెల్లడించారు. గతంలో హైదరాబాద్ సీపీగా పనిచేసిన అనుభవంతో ఈ కేసు పూర్వాపరాలపై తనకు పూర్తి అవగాహన ఉందని చెప్పారు. ప్రస్తుతం సిట్ విచారణ చేస్తోందని, త్వరలోనే కేసును సమగ్రంగా సమీక్షించి కోర్టులో తుది ఛార్జిషీట్ దాఖలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బాధ్యులెవరైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని తేల్చిచెప్పారు.

**కుంట్లూరు నుంచి పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు**

రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ సమీపంలోని కుంట్లూరు గ్రామంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన సీవీ ఆనంద్, తన కష్టంతో ఈ స్థాయికి చేరుకున్నారు. తండ్రి దామోదర్ రెడ్డి ప్రభుత్వ అధికారి కావడంతో చిన్నతనం నుంచే ఆయనకు పాలనా అంశాలపై పట్టు ఏర్పడింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, నిజాం కాలేజీ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఆయన 1991లో ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే ఆయన, అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన అనుభవంతో క్షేత్రస్థాయి సమస్యలపై మంచి అవగాహన కలిగి ఉన్నారు.

**సాహసాలకు కేరాఫ్ అడ్రస్.. సంస్కరణల ఆద్యుడు**

సీవీ ఆనంద్ తన సర్వీసులో అత్యంత క్లిష్టమైన మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పదేళ్ల పాటు పనిచేశారు. ప్రాణాలకు తెగించి అనేక ఆపరేషన్లలో పాల్గొన్నందుకు గాను 2002లో ఆయనను రాష్ట్రపతి గ్యాలెంటరీ మెడల్ వరించింది. కేవలం లా అండ్ ఆర్డర్ మాత్రమే కాకుండా, హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో ఆయన తెచ్చిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు, ఈచలాన్, స్పీడ్ గన్ వ్యవస్థలు దేశవ్యాప్త గుర్తింపు పొందాయి.

**మహిళా భద్రత - షీ టీమ్స్ రూపశిల్పి**

సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో ఐటీ కారిడార్‌లో మహిళలకు భద్రత కల్పించేందుకు ఆయన ప్రవేశపెట్టిన 'షీ టీమ్స్', 'షీ షటిల్స్' విజయవంతమయ్యాయి. అలాగే సిబ్బంది సంక్షేమంపై కూడా ఆయన ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు. ఎండలో పనిచేసే కానిస్టేబుళ్లకు సన్ గ్లాసెస్ పంపిణీ చేయడం వంటి నిర్ణయాలు ఆయనకు సిబ్బందిలో మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. సీనియారిటీ ప్రాతిపదికన యూపీఎస్సీ పంపిన జాబితాలో మొదటి పేరుగా ఉన్న సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల పోలీసు వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# కాంగ్రెస్ కూల్చివేతలు.. కేంద్రం బాదుడు

**మొదటిపేజీ తరువాయి**

ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్స్ విషయంలో మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామని ప్రభుత్వం చెప్పడంపై ఆయన మండిపడ్డారు. "ఉద్యోగులు ఏమైనా వరద బాధితులా? వారి హక్కుగా రావాల్సిన ప్రయోజనాల కోసం మంత్రుల దాతృత్వం అవసరమా?" అని ప్రశ్నించారు. సఫాయీ కార్మికుల శ్రమను గుర్తించడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని, ప్రస్తుత సర్కార్ పూర్తిస్థాయిలో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు.

**ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై స్పందన కరువు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సుమారు 120 మంది ఆటో డ్రైవర్లు బలవన్మరణానికి పాల్పడ్డారని కేటీఆర్ గుర్తుచేశారు. ఉపాధి కోల్పోయి వీధిన పడిన ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని ఆక్షేపించారు. వలస కార్మికుల పట్ల కూడా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, గతంలో కేసీఆర్ వారిని 'కడుపులో పెట్టుకుని' చూసుకుంటే, ఇప్పుడు రేవంత్ రెడ్డి వారి ఇళ్లపైకి బుల్డోజర్లు పంపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలన అంటే కూల్చివేతలు, ఎగవేతలు, పేల్చివేతలు మాత్రమేనని ఎద్దేవా చేశారు.

**మే డే వేళ కేంద్రం భారీ బాదుడు**

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను ఒకేసారి రూ. 1000 వరకు పెంచి ప్రధాని మోదీ కార్మికులకు చేదువార్త అందించారని కేటీఆర్ విమర్శించారు. గత 80 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు ఇంత భారీ పెంపును ఎప్పుడూ చూడలేదని ఆయన అన్నారు. "ప్రధాని గతంలో నిరుద్యోగులను పకోడీలు వేసుకోమన్నారు..



కానీ ఇప్పుడు గ్యాస్ ధరలు చూస్తే ఆ పకోడీలు కూడా వేసుకోలేని పరిస్థితి వచ్చింది" అని ఎద్దేవా చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ముగియగానే ధరలు పెంచడం బీజేపీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.

**బాధితులకు అందని సాయం**

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు రూ. కోటి ఇస్తామని చెప్పి ముఖ్యమంత్రి మాట తప్పారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అవినీతి వల్లే ఎస్సెల్బీసీ సొరంగం కుప్పకూలిందని, అక్కడ ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోతే వారి మృతదేహాలను కూడా వెలికితీయలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందని ఆక్షేపించారు. పేదల కష్టాలు తెలిసిన కేసీఆర్ తిరిగి వస్తేనే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, మరో రెండేళ్లు భరిస్తే కార్మికుల కష్టాలను బీఆర్ఎస్ తీరుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కార్మికులతో కలిసి కేటీఆర్ భోజనం చేసి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు.

# అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా గుట్టు రట్టు

- ముంబయిలో రూ.1,745 కోట్ల కొకైన్ సీజ్
- అంతర్జాతీయ ముఠాను పట్టుకున్న ఎన్‌సీబీ
- 'బాటమ్-టు-టాప్' విధానం సక్సెస్
- ఎన్‌సీబీ బృందంపై అమిత్ షా ప్రశంసల జల్లు
- తుర్కియే నుంచి భారత్‌కు దావూద్ అనుచరుడు సలీం డోలా తరలింపు
- 'ఆపరేషన్ గ్లోబల్ హంట్' ద్వారా మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ అరెస్ట్
- డ్రగ్ కింగ్‌పిన్‌లకు హోం మంత్రి అమిత్ షా హెచ్చరిక

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ముంబయి కేంద్రంగా సాగుతున్న భారీ అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. సుమారు రూ. 1,745 కోట్ల విలువైన 349 కిలోల అత్యంత నాణ్యమైన (హైగ్రేడ్) కొకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భారీ విజయంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని, స్మగ్లర్లను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తామని ఆయన హెచ్చరించారు. ఒక చిన్న క్లూ ఆధారంగా మొత్తం నెట్‌వర్క్‌ను పట్టుకోవడం ఎన్‌సీబీ సమర్థతకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

**బాటమ్-టు-టాప్ విధానంతో విజయం**

ఈ ఆపరేషన్ గురించి అమిత్ షా సోషల్ మీడియా వేదికగా వివరిస్తూ.. ఎన్‌సీబీ అనుసరించిన 'బాటమ్‌టుటాప్' వ్యూహాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఒక చిన్న డ్రగ్స్ కన్సైన్‌మెంట్‌ను పట్టుకున్న అధికారులు, దాని మూలాలను వెతుకుతూ వెళ్లి చివరకు అంతర్జాతీయ స్థాయిలో విస్తరించిన భారీ నెట్‌వర్క్‌ను ఛేదించగలిగారు. "మాదకద్రవ్యాల ముఠాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ప్రభుత్వం నిశ్చయించుకుంది. ఈ విజయం అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠాపై సాధించిన పెద్ద విజయం" అని ఆయన పేర్కొన్నారు. అత్యున్నత నాణ్యత కలిగిన కొకైన్‌ను సీజ్ చేయడం ద్వారా దేశంలోకి భారీగా డ్రగ్స్ సరఫరా కాకుండా అడ్డుకోగలిగారు.

**సలీం డోలా రాకతో పెరిగిన ఉత్కంఠ**

ముంబయిలో భారీగా డ్రగ్స్ పట్టుబడటానికి ముందే, మోస్ట్ వాంటెడ్ డ్రగ్ ట్రాఫికర్ సలీం డోలాను తుర్కియే ప్రభుత్వం భారత్‌కు అప్పగించడం గమనార్హం. అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు అత్యంత సన్నిహితుడైన సలీంపై ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీసులు ఉన్నాయి. 'ఆపరేషన్ గ్లోబల్ హంట్'లో భాగంగా భారత నిఘా సంస్థల సమాచారంతో తుర్కియే పోలీసులు ఇస్తాంబుల్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలించిన సలీంను ప్రస్తుతం ఎన్‌సీబీ అధికారులు విచారిస్తున్నారు. గతేడాది యూఏఈలో పట్టుబడిన సలీం కుమారుడు తాహెర్ ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఈ అంతర్జాతీయ ఆపరేషన్ విజయవంతమైనట్లు తెలుస్తోంది.

**తెలుగు రాష్ట్రాల్లోనూ డ్రగ్స్ కలకలం**

ఒకవైపు ముంబయిలో భారీ సీజ్ జరుగుతుండగా, మరోవైపు తెలంగాణలోనూ డ్రగ్స్ అక్రమ రవాణా కలకలం రేపింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఐ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రూ. 11.4 కోట్ల విలువైన 11.4 కిలోల క్రిస్టల్ మెత్ పట్టుబడింది. ట్రాలీ బ్యాగుల్లో అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు మహిళలను తనిఖీ చేయగా ఈ భారీ మొత్తం బయటపడింది. వీరిని అరెస్ట్ చేసిన అధికారులు ముఠా మూలాల కోసం ఆరా తీస్తున్నారు.

**శంషాబాద్ విమానాశ్రయంలో గంజాయి పట్టివేత**

హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కూడా విదేశాల నుంచి డ్రగ్స్ తరలిస్తున్న ఘటన వెలుగు చూసింది. బ్యాంకాక్ నుంచి ఎయిర్ ఆసియా విమానంలో వచ్చిన ఒక ప్రయాణికుడిపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా, 16 సీల్డ్ ప్యాకెట్లలో 6.15 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయి లభ్యమైంది. దీని విలువ సుమారు రూ. 2.15 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయాల ద్వారా డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల పట్ల అధికారులు నిరంతరం నిఘా ఉంచుతున్నారు.

**స్మగ్లర్లకు కేంద్రం కఠిన హెచ్చరిక**

డ్రగ్స్ మాఫియా కింగ్‌పిన్‌లకు ప్రపంచంలో ఏ మూలనా రక్షణ దొరకదని అమిత్ షా ఈ సందర్భంగా హెచ్చరించారు. సామాజిక భద్రతకు ముప్పుగా మారిన మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కేవలం డ్రగ్స్ పట్టుకోవడం మాత్రమే కాకుండా, ఈ దందా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులను పట్టుకుని కఠినంగా శిక్షించడం ద్వారా మాఫియా మూలాలను పెకిలించి వేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

# తెలంగాణ రక్షణ సేనలోకి మాజీ మంత్రి..

**మొదటిపేజీ తరువాయి**



మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేయడానికి, పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు.

సీనియర్ నాయకుడైన ఆయన చేరికతో ఆ ప్రాంతంలో పార్టీకి కొత్త ఉత్సాహం రానుంది. బోడ జనార్దన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఉన్న చెన్నూరు శాసనసభ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరపున వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది తన సత్తా చాటారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు హయాంలో ఆయన కార్మిక శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. అనుభవజ్ఞుడైన నాయకుడు పార్టీలో చేరుతుండటంపై టీఆర్ఎస్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఆర్టీసీ కార్మికులకు సీఎం మే డే కానుక

**మొదటిపేజీ తరువాయి**

నిలిచిందని కొనియాడారు. సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపైనే ఉందని, రాజకీయ ప్రభావాలకు లోనైతే సంస్థ నష్టపోతుందని హితవు పలికారు.

**అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలు**

ఆర్టీసీని మరింత ఆధునీకరించే దిశగా ప్రభుత్వం భారీ ప్రణాళికలు రూపొందిస్తోందని సీఎం తెలిపారు. శంషాబాద్ ప్రాంతంలో 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టర్మినల్‌ను నిర్మిస్తామని, అలాగే గాజులరామారంలో మరో టర్మినల్ కోసం 100 ఎకరాలు కేటాయించామని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యార్థం 1000 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి, వాటిని మెట్రో రైలు సర్వీసులతో అనుసంధానం చేస్తామన్నారు. దీనివల్ల ఆర్టీసీపై ఏటా పడుతున్న రూ. 2000 కోట్ల డీజిల్ భారం తగ్గుతుందని, ఆ ఆదాయాన్ని సంస్థ ప్రగతికి వాడుకోవచ్చని సూచించారు.

**బకాయిల చెల్లింపు.. కారుణ్య నియామకాలు**

గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను తమ ప్రభుత్వం క్లియర్ చేస్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి రూ. 1000 కోట్ల బకాయిలను విడుదల చేశామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల ప్రక్రియను కూడా వేగవంతం చేశామన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించినప్పటి నుండి ప్రభుత్వం సుమారు రూ. 8 వేల కోట్లను ఆర్టీసీకి అందజేసిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు.

**యూనియన్ల ఎన్నికలు.. పీఆర్సీపై చర్చిద్దాం**

ఆర్టీసీలో యూనియన్ల గుర్తింపు, విలీనం వంటి అంశాలపై కార్మిక సంఘాలే ఒక స్పష్టమైన ప్రణాళికతో రావాలని సీఎం కోరారు. పీఆర్సీ వంటి ఆర్థిక అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముందు ఆప్షన్లు ఉంచాలని, అధికారులకు, కార్మికులకు మధ్య ఎటువంటి అగాధం ఉండకూడదని సూచించారు. ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌ను కూడా తొలగించే ప్రసక్తి లేదని, సంస్థ మనుగడకు కార్మికుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆదేశాలు**


సమ్మె కాలపు వేతనాలు, కేసుల ఎత్తివేతపై కార్మిక సంఘాల విన్నపానికి సీఎం తక్షణమే స్పందించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ ఠాగూర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో ఆర్టీసీ కార్మికుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# కన్నుల పండుగ కూర్మా నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

- భారీగా హాజరైన భక్తులు ప్రజాప్రతినిధులు..

**తూప్రాన్ మే 1(డి డి 9వార్త )**

మెదక్ జిల్లా తూప్రాన్ శివారులోని రామాలయం సమీపంలోని అతి పురాతనమైన స్వయంభుగా వెలసిన శ్రీ కూర్మనారసింహస్వామి జయంతి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు.. బుధవారం గురువారం శుక్రవారం మూడు రోజులపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు ఆంజనేయ స్వామి వారికి చందన విలేయపదం ఆకు పూజ మరియు ధ్వజారోహణం సుదర్శన హోమం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం ఓడి బియ్యం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వాహకులు దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని బజారు రూపేష్ అందించారు, నిర్వాహకులు కంటాయపాలెం వేణుగోపాల్ ఆలయ పురోహితులు అహోబిలం ప్రవీణ్ , తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి, కౌన్సిలర్లు సబిత నాగేష్ ముదిరాజ్, బొడ్డు జోత్స్న వేణు, మాజీ మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, మాజీ శివంపేట ఎంపీపీ కల్లూరు హరికృష్ణ, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మామిడి వెంకటేష్, శ్రీశైలం గౌడ్, సీనియర్ పాత్రికేయులు జానకిరామ్ గౌడ్, నాగుల వేణుగోపాల్ గౌడ్, బిజెపి నాయకులు తాటి విట్టల్ మహేష్ గౌడ్ సంఖ్య యాదగిరి సాయి బాబా గౌడ్, శ్రీ వైష్ణవ సంగం సభ్యులు శ్రీ చూర్ణం విద్యాసాగర్ తిరునగరి డాక్టర్ ప్రదీప్ సింహ సుధాకర్, విష్ణు ,శ్రీధర్ ,రాము పాల్గొన్నారు.









# మే డే సందర్భంగా హంగార్గా ఫారం గ్రామంలో జండా ఆవిష్కరణ చేయడం జరిగింది

**నిజామాబాద్ పోతంగల్ మే 01+డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలం లోని , హంగర్గా ఫారం గ్రామంలో, ఏఐటియుసి అండ్ సిపిఐ మండల్ కార్యదర్శి కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో మే డే జెండా ఆవిష్కరణ జరిగింది డే141 మేడే పిలుపుమేరకు ఇక్కడ విచ్చేసిన కార్మిక కర్షక వర్గాల వారందరూ చికాగో కార్మికుల అమరవీరుల స్ఫూర్తితో మనం ఈ జెండా ఎగరడం జరుగుతుంది పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో అతి ముఖ్యమైన 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వ్యాపార వర్గాలకై పెట్టుబడిదారుల కు అనుకూలంగా నాలుగు లేబర్ కోర్టులను తెచ్చింది ఈ కోడ్ వల్ల కార్మికులకు 8 గంటల పనిని 12 గంటలకు పెంచాలని యోచనలో మోడీ ప్రభుత్వం చేస్తుంది కాబట్టి వాటిని తక్షణమే విరమించాలని ఈ మేడే ద్వారా ప్రభుత్వానికి హెచ్చరికలు పంపుతున్నాము లేదంటే రానున్న రోజుల్లో దీన్ని ఉధృతం చేస్తామని కార్మికుల కర్షకుల బలోపేతనం చూపించగలమని తెలియజేస్తున్నాము మా యొక్క డిమాండ్లు నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేస్తూ 29 కార్మిక చట్టాలను పునరుద్ధించాలని పిఎఫ్ ఈఎస్ఐ గ్రాడ్యుటీ బోనస్ చట్టాలపై ఉన్న సీలింగ్లను ఎత్తివేయాలని పిఎఫ్ నిధుల నుండి అదాన్ని తీసుకున్న 36 వేల కోట్లు డబ్బును వడ్డీతో సహా వసూలు చేయాలని లేదా క్రిమినల్ కేసులు పెట్టాలని హమాలి ఆటో ట్రాన్స్పోర్ట్ అసంఘటిత కార్మికులకు సమగ్ర సమీక్ష బోర్డు ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మికులకు సహజ మరణం కు 5 లక్షలు ఇవ్వాలని ప్రమాదవశాస్తూ ఏమైనా జరుగుతే 10 లక్షలు ఇవ్వాలని 60 సంవత్సరాలు నిండిన లేబర్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి 10000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని కాంటాక్ట్ లేబర్ విధానాలను రద్దుచేసి పనిచేస్తున్న కార్మిక ఉద్యోగులందరికీ పర్మనెంట్ చేయాలని ఆర్టీసీని ప్రభుత్వంలో కలపాలని గ్యాస్ డిజైన్ పెట్రోల్ డీజిల్ ధరలను తక్షణమే తగ్గించి నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని కాంటాక్ట్ అట్ స్పోర్టింగ్ స్కీమ్ వర్కర్లకు నెలకు 26 వేల జీతం చెల్లించాలని ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని బ్యాంకుల విలీనాన్ని ఆపాలి గ్రామపంచాయతీ లో మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వ నిధుల నుంచి నేరుగా 26 వేల జీతం చెల్లించాలని ఎన్హెచ్ఎఫ్ స్కీమ్ 2వ ఏఎన్ఎం లను వెంటనే పర్మినెంట్ చేయాలని ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలను కల్పించాలని రోజుకు 1000 రూపాయలు దిన కూలిగా చెల్లించాలని ఏఐటీయూసీ అండ్ సిపిఐ మేడే సందర్భంగా విన్నవించడం జరుగుతుంది తక్షణమే దీనికి ప్రభుత్వాలు స్పందించి డిమాండ్లను నెరవేర్చగలరని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో అండ్ సిపిఐ మండల్ కార్యదర్శి కొట్టే ప్రసాద్, మనోహర్, మాలు, యాజస్ ఖాన్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



# బోథ్ లో ఘనంగా మే డే వేడుకలు

- **కార్మిక హక్కుల సాధనే లక్ష్యం**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 01(డి డి 9వార్త ):-**

స్థానిక ఘనంగా గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే డే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సత్యానారాయణ గారు ఎర్ర జెండాను ఆవిష్కరించి, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం ప్రధాన కార్యదర్శి కార్పె శ్రీనివాస్ మాట్లాడుతూ.. "మే డే అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికుల పోరాట ఫలితం. 8 గంటల పని దినం కోసం ప్రాణత్యాగం చేసిన కార్మికుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా మా సంఘం పనిచేస్తుంది" అని అన్నారు.సంఘం ఉపాధ్యక్షులు అనుపచందు, కోశాధికారి రాజేశ్వర్ లు మాట్లాడుతూ.. కార్మికులందరూ సంఘటితంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని, ప్రభుత్వం కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అందే ప్రయోజనాలను ప్రతి కార్మికుడికి అందేలా చూడాలని కోరారు.ఈ వేడుకల్లో సంఘ సభ్యులు రమేష్, మంగులాల్, ఇప్ప శంకర్ మరియు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

# ఘనంగా వీర బ్రహ్మేంద్ర స్వామి కళ్యాణం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 01(డి డి 9వార్త ):-**



బోథ్, మండలంలోని కౌటబి గ్రామంలోని శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం వీర బ్రహ్మేంద్ర స్వామి శ్రీ గోవిందమాంబల కళ్యాణ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. బోథ్ కు చెందిన వేద పండితులు మల్లేష్ ఈ కళ్యాణ మహోత్సవంను నిర్వహించారు. గురువారం రాత్రి స్వామి వారి రథ యాత్రను గ్రామ పుర వీధుల గుండా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రథ యాత్ర అనంతరం ఆలయంలో మహారాష్ట్ర నుండి వచ్చిన ప్రత్యేక భజన బృందాలు ఆలపించిన గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగిన రథోత్సవ, కళ్యాణ మహోత్సవ వేడుకలతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమాలకు గ్రామానికి చెందిన వారే కాకుండా చుట్టూ పక్క గ్రామాలు, పల్లెల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కళ్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ వేడుకలకు తమ సహాయ సహకారాలను అందించిన వారికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.





# ప్రమాదవశత్తు కాలిపోయిన పంట పొలాలను పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ .

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 01(డి డి 9వార్త ):-**

ఈ రోజు బోథ్ మండలంలోని పొచ్చేర గ్రామానికి చెందిన గొండ్ల స్వామి గారికి చెందిన 5 ఎకరాల జొన్న పంట మరియూ 20 పైపులు మొత్తం కాలిపోగా అదే గ్రామానికి చెందిన గొండ్ల వెంకట రమణ గారి 7 ఎకరాలలో పండించిన మొక్కజొన్న తో పాటు 50 పైపులు మొత్తం అగ్నికి ఆహుతి అయింది అదే గ్రామానికి చెందిన కంసాలి వెంకటి గారిది రెండు ఎకరాల జొన్న మరియూ 30 పైపులు,యటకారి రమేష్ రైతువి 30 పైపులు మొత్తం అగ్నికి పూర్తిగా కాలిపోయినవి.అదే విధంగా నిన్న బోథ్ పట్టణానికి చెందిన సింగం రమణ గారిది 6 ఎకరాల జొన్న పంట మొత్తం కాలిపోవడం చాల బాధకారం అని అన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదవశత్తు కాలిపోయిన పంటలను ప్రభుత్వం ఆయా రైతులకు నష్టపరిహారం అందించాలి అని అన్నారు అదేవిధంగా ప్రభుత్వ నిర్లక్ష్యం వళ్ళ జొన్న రైతులు ఇప్పటికే చాలా నష్టపోతున్నారు అని అన్నారు ఎప్పటికైనా ప్రభుత్వం స్పందించి జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి అని అన్నారు





# గులాబీమాయమైన రాంపూర్ గ్రామం.

- **గులాబీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించిన గౌరవ బోథ్ MLA శ్రీ. అనిల్ జాదవ్**
- **మళ్ళీ కెసిఆర్ గారే రావాలి కారే కావలి అంటున్న గిరిజన గ్రామాలు**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే01(డి డి 9వార్త ):-**

ఈ రోజు బజార్ హత్నూర్ మండలంలోని గుడ్ మార్నింగ్ బోథ్ కార్యక్రమం గిరిజన గ్రామమైన రాంపూర్ గ్రామంలో సందర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామంలో కెసిఆర్ ఇచ్చిన భగీరథ నీరే మా గ్రామానికి ఒక వరంలా మరింది. అని గ్రామం పటేల్ అన్నారు అనంతరం గౌరవ బోథ్ ఎమ్మెల్యే మాట్లాడుతూ కెసిఆర్ . చేసిన అభివృద్ధి ఇప్పటికి పల్లెల్లో ఉంది తప్ప కొత్తగా ఈ గవర్నమెంట్ చేసింది ఏమి లేదు అని అన్నారు కెసిఆర్ గారి పాలనలో పల్లెలు అన్ని కళ కళ లాడేవి కానీ ఈ కాంగ్రెస్ పాలనలో పల్లెటూరు అభివృద్ధి పక్కసింది అని అన్నారు నాడు కెసిఆర్ గారి హయం లొ రైతులకు రైతుబంధు చెకచెక వస్తుండే కానీ ఇప్పుడు నెలకు ఒక ఎకరం చొప్పున ఇస్తున్నారు అదేకాకుండా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి 3 సార్లు రైతు బంధు మునగోట్టింది అని అన్నారు.పార్టీ లొ చేరిన ముఖ్య నాయకులు వినాయక్ రావు,గోవింద్ రావు, రాంజీ, దేవురావు, రాజారామ్, గొద్రు తో పాటు మహిళా సోదరులు భారీ ఎత్తున్న పార్టీలొ చేరారు.ఈ కార్యక్రమం మండలం పార్టీ నాయకులు కార్యకర్తలు. తదితరులు ఉన్నారు



# వైకల్యాల గుర్తింపుతోనే చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 30(డీడీ9 వార్త) :**

చిన్నారుల్లో శారీరక వైకల్యాలను, ఎదుగుదల లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ రాజశ్రీ, జిల్లా సంక్షేమాధికారిణి పద్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ఆధ్వర్యంలో 'బాల భరోసా' కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు పిల్లల్లో తలెత్తే నాడీ సంబంధిత సమస్యలు, అభివృద్ధిలో జాప్యాన్ని గుర్తించేందుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య మరియు మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతోనే ఈ లక్ష్యం నెరవేరుతుందని, అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగమోహన్‌రావు మాట్లాడుతూ, సమస్యలున్నట్లు గుర్తించిన చిన్నారులకు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పూర్తిస్థాయిలో ఉచిత వైద్య సహాయం అందుతుందని తెలిపారు. వేసవి సెలవులు ఉన్నప్పటికీ, ఆర్బీఎస్‌కే బృందాలు నిర్వహించే స్క్రీనింగ్‌కు అంగన్‌వాడీ సిబ్బంది సహకరించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ కోరారు. జిల్లా ఆసుపత్రిలోని 4వ అంతస్తులో ఉన్న ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రంలో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రాజశ్రీ వివరించారు. పుట్టుకతో వచ్చే లోపాలు, గుండె జబ్బులు, రక్తహీనత, దంత, కంటి సమస్యలతో బాధపడే 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ మొబైల్ హెల్త్ టీమ్స్ ద్వారా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 30(డీడీ9 వార్త) :**






జిల్లాలో ఈ నెల 3న జరగనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్, బోధన్ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన 7 పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. సిపి తెలిపిన వివరాల ప్రకారం.. పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడాన్ని నిషేధించారు. పరీక్షలు జరిగే రోజున ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని యజమానులను ఆదేశించారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తుతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాసి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సీపీ వారికి 'ఆల్ ది బెస్ట్' తెలిపారు.

# మహిళలు, బాలల రక్షణపై పోలీసుల ప్రత్యేక నిఘా

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 30(డీడీ9 వార్త) :** సమాజంలో మహిళల భద్రత, బాలల రక్షణే ధ్యేయంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ అడుగులు వేస్తోంది. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం మాక్లూర్ మండలంలోని మెట్టు, మాధాపూర్, వేణు కిసాన్ నగర్ గ్రామాల్లో చైల్డ్ సేఫ్టీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నిజామాబాద్ భరోసా సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుల్లో మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్ ప్రతినిధులు మాట్లాడుతూ.. సమాజంలో వేళ్లూనుకున్న పితృస్వామ్య పోకడలు, లింగ వివక్షను వీడి మహిళా సాధికారతకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా బాల్య వివాహాల నిర్మూలన, కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై అవగాహన కల్పించారు. సామాజిక సమస్యల పరిష్కారంలో స్థానిక సర్పంచ్‌లు, కమ్యూనిటీ లీడర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాల్లో సానుకూల మార్పులు వచ్చినప్పుడే మహిళలకు, బాలలకు పూర్తిస్థాయిలో రక్షణ లభిస్తుందని వివరించారు. అనంతరం టెక్నాలజీ యుగంలో పొంచి ఉన్న సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్షణ కోసం యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, వేధింపులకు గురయ్యే మహిళలకు అండగా నిలిచేందుకు 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం ద్వారా చట్టపరమైన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భరోసా కోఆర్డినేటర్ రోజా, డబ్ల్యూఎస్ఐ పుష్పావతి, గ్రామ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మరియు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.




# వైద్య కళాశాల సూపరింటెండెంట్‌ను కలిసిన టీఎన్జీవోస్ ప్రతినిధులు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 30(డీడీ9 వార్త) :** తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజ్‌ను ల్యాబ్ టెక్నీషియన్ల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. శుక్రవారం కళాశాలలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ నాగరాజ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైద్య కళాశాల అభివృద్ధిలో అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమరిపేట్ స్వామి, రాణి, రామలక్ష్మి, నరేందర్, శ్రీనివాస్, సుమన్, ఎస్. సంతోష్, సంతోష్ రెడ్డి, వేణు, కె. సంతోష్, శ్రావణ్, ఆదిత్య, భూమేష్, సందీప్, స్వామి, రాష్ట్ర పాల్ తదితరులు పాల్గొని సూపరింటెండెంట్‌కు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు



# ఘనంగా మే డే వేడుకలు

మండల కేంద్రమైన భీంగల్ పట్టణంలో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ (మేడే) వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎర్రజెండాలను ఆవిష్కరించి, ఐక్యతను చాటారు. కార్మికుల హక్కుల సాధన కోసం, వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు సాగించాలని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలోముఖ్యఅతిథులుమాట్లాడుతూ.. సమాజగమనంలోకార్మికులపాత్రవెలకట్టలేనిదని, కానీ వారి కష్టానికి తగిన గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పని ప్రదేశాల్లో తగిన భద్రతా చర్యలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం కార్మిక ఐక్యత వర్ధిల్లాలి అంటూ చేసిన నినాదాలతో పట్టణ పురవీధులు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో హమాలీ కార్మికులు పాల్గొన్నారు.







# ఇందూరు తిరుమల క్షేత్రంలో వైభవంగా శ్రీవారి పల్లకి సేవ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 30(డీడీ9 వార్త) :** ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం పౌర్ణమి వేడుకలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, భక్తజన సందోహం మధ్య శ్రీవారిని పల్లకిపై ఊరేగించారు. వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామ స్మరణతో క్షేత్ర ప్రాంగణం మారుమోగింది. పల్లకి సేవ అనంతరం స్వామివారికి నయనానందకరంగా ఊంజల సేవను నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా గత పదేళ్లుగా కొనసాగుతున్న దివ్య ఔషధ ప్రసాద వితరణ కార్యక్రమం విశేషంగా సాగింది. ప్రతి పౌర్ణమి నాడు గర్భిణీ స్త్రీలకు అందించే ఈ ఔషధ ప్రసాదాన్ని ఆలయ అర్చకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు రోహిత్ కుమార్ ఆచార్య మాట్లాడుతూ.. ఈ దివ్య ఔషధాన్ని సేవించడం వల్ల మాతృమూర్తులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు, పుట్టబోయే బిడ్డలు సైతం సంపూర్ణ ఆరోగ్యంతో జనిస్తున్నారని పేర్కొన్నారు. ఆలయంలో అందిస్తున్న ప్రతి ఔషధం స్వామివారి అనుగ్రహంతో ప్రసాదంగా మారి భక్తులకు మేలు చేకూరుస్తోందని అర్చకులు సంపత్ కుమార్ ఆచార్య అభిప్రాయపడ్డారు. ఆధ్యాత్మిక కార్యక్రమంతో పాటు ఏర్పాటు చేసిన సంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈటీవీ ఫేమ్, ప్రముఖ వేణుగాన విద్వాంసులు యుగంధర్ గారు తన మురళీ గానంతో స్వామివారి కీర్తనలను ఆలపించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ఆయన అందించిన వేణుగానం క్షేత్రంలో భక్తి పారవశ్యాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు నర్సారెడ్డి, నరాల సుధాకర్, భాస్కర్ తదితరులు పాల్గొని వేడుకలను పర్యవేక్షించారు

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాడుదాం: ఐఎఫ్టీయూ పిలుపు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 30(డీడీ9 వార్త) :** ప్రపంచ కార్మికవర్గ పోరాట దినోత్సవం 140వ మేడేను పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని ఐఎఫ్టీయూ కార్యాలయం వద్ద ఎర్రజెండా రెపరెపలాడింది. సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వరదయ్య ఈ వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. కార్మికులు సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం కార్మిక లోకానికి తీరని అన్యాయం చేయడమేనని ఆయన విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే కార్మిక చట్టాలను నీరుగార్చిందని, లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందని వరదయ్య మండిపడ్డారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు కనీస వేతనం 26,000 రూపాయలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఏళ్ల తరబడి అరకొర జీతాలతో వెట్టిచాకిరీ చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని పట్టుబట్టారు. కార్మిక హక్కుల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సాయిలు, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ గంగాధర్ గౌడ్, నాయకులు రాజ్ కుమార్, వినోద్, బండారి గంగాధర్, సయాగౌడ్, నారాయణ, శంకర్ గౌడ్, రాజేందర్ గౌడ్, పల్లవి, శ్రీనివాస్, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# చికాగో అమరవీరుల స్ఫూర్తితో హక్కుల పోరాటం సాగిద్దాం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 30(డీడీ9 వార్త) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు చికాగో అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు సాగించాలని ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్ పిలుపునిచ్చారు. మాక్లూర్ మండలం మదన్ పల్లి గ్రామంలో శుక్రవారం 140వ మేడే దినోత్సవం సందర్భంగా అమాలి కార్మికులతో కలిసి ఆయన ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. దేశ సంపదైన సహజ వనరులు, గనులు, ఫ్యాక్టరీలు, భూములను కేంద్రంలోని మోడీ సర్కార్ స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి భద్రత, సమ్మె చేసే హక్కు, వేతన పెంపు కోసం ప్రశ్నించే హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందని మండిపడ్డారు. సూపర్ మార్కెట్లు, షాపింగ్ మాళ్లు, ప్రైవేట్ ఆస్పత్రులు, హోటళ్లలో కార్మికులతో కనీస వేతనం లేకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 'సమాన పనికి సమాన వేతనం' అమలు చేయాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్మికులను వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, వారికి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు లక్ష్మణ్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



# కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- **రాష్ట్ర సిపిఐ కార్యా దర్శి వర్గ సభ్యుడు వి ఎస్ బోస్**

**జవహర్ నగర్, మే 1,(డి డి 9వార్త ):** మే డే ను పురస్కరించుకొని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వాడవాడలో మేడే జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. సిపిఐ కాప్రామండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో డెంటల్ కాలేజీ, గిరిప్రసాద్ నగర్ జెండా ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ దర్శి సభ్యులు విఎస్ బోసు మాట్లాడుతూ.. మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా దేశంలోని సమస్త కార్మికులు కూలీలు ఉద్యోగులు అసంఘటిత రంగ కార్మికులు మరియు నిరుద్యోగ యువత కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం కార్మిక హక్కు లు ఇవన్నీ కార్మికుల దీర్ఘకాలిక పోరాటాల ఫలితాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, నిమ్మల నరసింహ, కాప్రా మండల సహాయ కార్యదర్శి రాజేశ్వరి ,గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్, ఏఐటిసి మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, కీసర మండల సహాయ కార్యదర్శి వి రవి, గిరి ప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి కొండా సత్యం సాగర్, మహిళా సమైక్య మండల అధ్యక్షులు కార్యదర్శులు కోదాసు జయమ్మ, కే కవిత,సిపిఐ కాలనీ కార్యదర్శి కె రాజు, కే కురుమయ్య,ఎల్లయ్య,నరసింహ,బద్రి లక్ష్మి శ్యామ్ దాస్, డి మల్లిక,తదితరులు పాల్గొన్నారు.



# బౌలర్లకు న్యాయం కావాలి.. ఐపీఎల్ నిబంధనల్లో మార్పులు తప్పనిసరి!

- ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుసగా భారీ స్కోర్లు
- తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న బౌలర్లు
- ఐపీఎల్ నిబంధనల్లో మార్పులు తప్పనిసరి

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుసగా భారీ స్కోర్లు నమోదవుతున్నాయి. పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్స్ భారీ స్కోర్లు నమోదు చేశాయి. ఈ నేపథ్యంలో మాజీ భారత క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాటర్లకు అధిక ప్రాధాన్యం లభిస్తుండగా.. బౌలర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ నిబంధనల్లో రెండు ప్రధాన మార్పులు అవసరమని కైఫ్ సూచించాడు.

'మైదానాల పరిమాణాన్ని స్థిరంగా ఉంచాలి. ప్రస్తుతం కొన్ని స్టేడియాల్లో బౌండరీలు చిన్నగా ఉండటంతో బ్యాటర్లు సులభంగా భారీ షాట్లు ఆడుతున్నారు. దీంతో ప్రతి మ్యాచ్‌లో 250300 పరుగులు సాధారణంగా మారిపోయాయి. 150170 వంటి స్కోర్లను కాపాడటం బౌలర్లకు దాదాపు అసాధ్యంగా మారింది. అందుకే అన్ని మైదానాల్లో ఒకే విధమైన, కొంచెం పెద్ద బౌండరీలను ఉంచాలి. ఇది బౌలర్లకు కొంత వరకు న్యాయం చేస్తుంది' అని మొహమ్మద్ కైఫ్ మొదటి మార్పుగా చెప్పాడు.

ఇక రెండో మార్పుగా.. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను తొలగించాలని కైఫ్ స్పష్టం చేశాడు. 'ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన వల్ల జట్లు అదనపు బ్యాటర్‌ను వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. దీని వల్ల బౌలర్ల ప్రాముఖ్యత తగ్గిపోతోంది. అంతేకాకుండా ఈ రూల్ అంతర్జాతీయ క్రికెట్‌లో లేకపోవడం కూడా దాని అవసరంపై సందేహాలు కలిగిస్తోంది. ఐపీఎల్‌లో ఈ నిబంధన వల్ల మ్యాచ్‌లు బ్యాటింగ్‌కు



అనుకూలంగా ఉండి భారీ స్కోర్లు నమోదవుతున్నాయి' అని కైఫ్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్‌లో బ్యాటింగ్ ఆధిపత్యం పెరుగుతున్న నేపథ్యంలో బౌలర్లకు సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కైఫ్ ఈ సూచనలు చేశాడు. భవిష్యత్తులో బీసీసీఐ ఈ అంశాలను పరిశీలించి మార్పులు చేస్తుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

## నా కుటుంబం ఫొటో తీయవద్దు: అభిమానికి హైదరాబాద్ ఆటగాడు క్లాసెన్ హెచ్చరిక

- ముంబై ఇండియన్స్‌పై విజయం అనంతరం హైదరాబాద్ బయలుదేరిన సన్‌రైజర్స్
- "మీరు చాలా బాగా ఆడారు" అంటూ అభిమాని ప్రశంస
- ఫొటో తీయడానికి ప్రయత్నించడంతో వద్దని వార్నింగ్

**డిడి9 వార్త:**

తనతో పాటు తన కుటుంబాన్ని ఫొటో తీయడానికి ప్రయత్నించిన ఒక అభిమానిపై సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ ఒకింత అసహనం వ్యక్తం చేశాడు. గత సంవత్సరం జూన్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి క్లాసెన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ జట్టు తరఫున అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సన్‌రైజర్స్ తదుపరి మ్యాచ్ కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరగనుంది.

ముంబై ఇండియన్స్‌పై విజయం అనంతరం, సన్‌రైజర్స్ జట్టు హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ సమయంలో క్లాసెన్‌తో ఒక అభిమాని మాట్లాడుతూ, "మీరు చాలా బాగా ఆడారు" అని ప్రశంసించాడు. క్లాసెన్ స్పందిస్తూ, "థాంక్యూ వెరీమచ్ సర్" అన్నాడు.

అంతలో ఆ అభిమాని ఫొటోలు తీయడానికి ప్రయత్నించాడు. "దయచేసి ఫొటోలు, వీడియోలు తీయకండి. నేను అటు తిరిగితే నా ఫ్యామిలీ ఫొటోలు తీస్తారు. కానీ అలా చేయకండి. మీరు ఆపకపోతే బాగుండదు. మిమ్మల్ని మట్టికరిపిస్తాను" అని హెచ్చరించాడు. క్లాసెన్ హెచ్చరించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కానీ ఇందులో అతని ముఖం మాత్రం కనిపించలేదు. సామాజిక మాధ్యమాల్లో క్లాసెన్‌కు మద్దతు లభించింది.



## హాకీ ప్రాక్టీస్‌లో తీవ్ర విషాదం.. బంతి తగిలి 13 ఏళ్ల బాలిక మృతి

- ప్రాక్టీస్ చేస్తుండగా తలకు బలంగా తగిలిన హాకీ బంతి
- అన్నను చూసి హాకీ ప్లేయర్‌గా మారాలనుకున్న బాలిక
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు

**డిడి9 వార్త:**

గురువారం పాఠశాలలో హాకీ శిక్షణ తీసుకుంటుండగా బంతి తలకు బలంగా తగిలి 13 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయింది. గోవా, గుయిరింలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రుయీషా ఖర్సెల్ ఈ ఘటనలో మరణించింది.

వేసవి సెలవులకు ముందు పాఠశాల చివరి రోజు కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా హాకీ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో జరగబోయే పోటీల కోసం సిద్ధమవుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. శిక్షణలో ఉండగా హాకీ బంతి రుయీషా తలకు తగలడంతో ఆమె మైదానంలోనే కుప్పకూలిపోయింది.

వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసినప్పటికీ, అది రావడానికి సమయం పడుతుందని తెలియడంతో పాఠశాల సిబ్బంది ఓ ప్రైవేట్ వాహనంలో ఆమెను ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి చేరుకునేలోపే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక శుక్రవారం వస్తుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్కూల్ సమయంలోనే జరిగిందని ప్రిన్సిపాల్ ఫాదర్ మిల్చెస్టర్ ఫర్టాడో చెప్పారు.

తన సోదరుడు సూరజ్‌ను చూసి స్ఫూర్తి పొందిన రుయీషా రెండేళ్ల క్రితమే హాకీ ఆడటం ప్రారంభించింది. 15 ఏళ్ల సూరజ్ గత నెలలో జరిగిన సబ్‌జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో గోవా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. "చెల్లి ఎప్పుడూ నా హాకీ స్టిక్‌నే వాడేది. ప్రాక్టీస్ సెషన్ ముగియడానికి కేవలం పది నిమిషాలు ఉండగా ఈ ఘోరం జరిగింది" అని సూరజ్ కన్నీటితో చెప్పాడు.

రుయీషా తల్లి ఓ ఇంట్లో పనిమనిషిగా, తండ్రి స్థానిక దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె మరణవార్తతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. "క్షమించు రుయీషా, నిన్ను కాపాడుకోలేకపోయాను. నన్ను వదిలి ఎందుకు వెళ్లిపోయావు? దయచేసి తిరిగిరా" అంటూ తల్లి గుండెలవిసేలా రోదించడం అక్కడున్న వారిని కదిలించింది.



## సహనం కోల్పోయిన కోహ్లీ.. పటీదార్ ఔట్‌పై అంపైర్‌తో వాగ్వివాదం..

- అంపైర్ నిర్ణయంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన విరాట్ కోహ్లీ
- రజత్ పాటిదార్ వివాదాస్పద క్యాచ్ ఔట్‌తో మొదలైన వివాదం
- ఆర్సీబీపై 4 వికెట్ల తేడాతో గుజరాత్ ఉత్కంఠ విజయం
- పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఆర్సీబీ, ఐదో స్థానంలో గుజరాత్

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026లో భాగంగా గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య గత రాత్రి జరిగిన మ్యాచ్‌లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంపైర్ ఇచ్చిన వివాదాస్పద ఔట్‌పై ఆర్సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఫీల్డ్ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు.

నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ ఇన్నింగ్స్‌లో 8వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో రజత్ పాటిదార్ (19) పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించగా ఫీల్డర్ జాసన్ హోల్డర్ ముందుకు డైవ్ చేస్తూ క్యాచ్ అందుకున్నాడు. అయితే, బంతి నేలకు తాకినట్లు రీప్లేలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ థర్డ్ అంపైర్ ఫీల్డ్ అంపైర్ నిర్ణయానికే కట్టుబడి పాటిదార్‌ను ఔట్‌గా ప్రకటించాడు.

ఈ నిర్ణయంపై డగౌట్‌లో ఉన్న విరాట్ కోహ్లీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. కీలక సమయంలో అంపైర్ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ కనిపించాడు. అంతకుముందు 13 బంతుల్లో 28 పరుగులు చేసి ఔటైన కోహ్లీ, ఆ తర్వాత బౌండరీ లైన్ వద్దకు వచ్చి అంపైర్‌తో చాలాసేపు చర్చించడం కెమెరాల్లో రికార్డయింది.

ఇక మ్యాచ్ విషయానికొస్తే ఆర్సీబీపై గుజరాత్ టైటాన్స్ 4 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 19.2 ఓవర్లలో 155 పరుగులకు ఆలౌట్ కాగా, గుజరాత్ 15.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. గుజరాత్ విజయంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (43), జోస్ బట్లర్ (39) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడగా, రాహుల్ తెవాటియా (27*) జట్టును విజయతీరాలకు చేర్చాడు.

ఈ విజయంతో గుజరాత్ 10 పాయింట్లతో ఐదో స్థానానికి ఎగబాకగా, ఓడినప్పటికీ ఆర్సీబీ 12 పాయింట్లతో రెండో స్థానంలోనే కొనసాగుతోంది.




## కెనడా క్రికెట్‌లో కొత్త శకం.. హెడ్ కోచ్‌గా భారత సంతతి వ్యక్తి

- కెనడా పురుషుల క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా మాంటీ దేశాయ్ నియామకం
- నేపాల్‌కు వన్డే హోదా తిరిగి సాధించడంలో కీలక పాత్ర పోషించిన దేశాయ్
- అసోసియేట్ జట్లను తీర్చిదిద్దడంలో ఆయనకు 20 ఏళ్ల అనుభవం
- కెనడా సామర్థ్యాన్ని నిలకడైన ప్రదర్శనగా మారుస్తానని చెప్పిన మాంటీ దేశాయ్
- దేశాయ్ నాయకత్వంలో జట్టు పురోగతి సాధిస్తుందని క్రికెట్ కెనడా విశ్వాసం

**డిడి9 వార్త:**

అంతర్జాతీయ క్రికెట్‌లో తమ స్థానాన్ని పదిలపరుచుకునే దిశగా కెనడా క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. తమ పురుషుల జాతీయ జట్టు హెడ్ కోచ్‌గా అనుభవజ్ఞుడైన మాంటీ దేశాయ్‌ను నియమించింది. అసోసియేట్ దేశాల జట్లను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో పేరుగాంచిన దేశాయ్ నియామకం, కెనడా క్రికెట్‌లో కొత్త శకానికి నాంది పలుకుతుందని భావిస్తున్నారు.

మాంటీ దేశాయ్‌కు అంతర్జాతీయ కోచింగ్‌లో 20 ఏళ్లకు పైగా విస్తృతమైన అనుభవం ఉంది. ముఖ్యంగా నేపాల్ క్రికెట్ జట్టుకు ఆయన అందించిన సేవలు అమోఘం. ఆయన కోచింగ్‌లోనే నేపాల్ వన్డే హోదాను తిరిగి నిలబెట్టుకోవడమే కాకుండా పలు ఐసీసీ గ్లోబల్ ఈవెంట్లకు అర్హత సాధించింది. ఆఫ్ఘనిస్థాన్, యూఏఈ, వెస్టిండీస్ వంటి జట్లతో కూడా ఆయన పని చేశారు. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు టాలెంట్ స్కౌటింగ్‌లోనూ సహకారం అందించారు. వర్ధమాన జట్లలో నమ్మకాన్ని, క్రమశిక్షణను, పోటీతత్వాన్ని నింపడంలో ఆయన స్పెషలిస్ట్‌గా గుర్తింపు పొందారు.

ఈ నియామకంపై మాంటీ దేశాయ్ స్పందిస్తూ... "ఈ బాధ్యతను స్వీకరించడం గౌరవంగా భావిస్తున్నాను. నాపై నమ్మకం ఉంచినందుకు క్రికెట్ కెనడాకు ధన్యవాదాలు. నమ్మకం, క్రమశిక్షణ, నిర్భయత్వం వంటి లక్షణాలు ఎలాంటి అద్భుతాలు చేయగలవో నేపాల్, ఆఫ్ఘనిస్థాన్ వంటి జట్లు నిరూపించాయి. కెనడాకు కూడా అలాంటి గొప్ప అవకాశం ఉంది. ఈ జట్టు సామర్థ్యాన్ని అంతర్జాతీయ వేదికపై నిలకడైన ప్రదర్శనగా మార్చడమే నా లక్ష్యం" అని వివరించారు.

ఇటీవల ముగిసిన ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో కెనడా పాల్గొన్న నేపథ్యంలో రాబోయే ఐసీసీ టోర్నమెంట్‌లను దృష్టిలో ఉంచుకుని ఈ నియామకాన్ని వ్యూహాత్మకంగా చేపట్టింది. క్రికెట్ కెనడా ప్రెసిడెంట్ అర్విందర్ ఖోసా మాట్లాడుతూ... "అద్భుతమైన ప్రదర్శన, వృత్తి నైపుణ్యం ద్వారా క్రికెట్ కెనడా ప్రాముఖ్యతను పునరుద్ధరించడమే మా లక్ష్యం. మాంటీ దేశాయ్ నియామకం మా విజన్‌కు అద్దం పడుతోంది. ముఖ్యంగా నేపాల్, ఆఫ్ఘనిస్థాన్‌తో ఆయన పనితీరు, స్పష్టమైన ప్రణాళికతో జట్లను ఎలా మార్చగలరో నిరూపిస్తుంది. ఆయన నాయకత్వంలో మా జట్టు గణనీయమైన పురోగతి సాధిస్తుందని విశ్వసిస్తున్నాం" అని తెలిపారు. క్రికెట్ కెనడా సెక్రటరీ పరంజిత్ సైనీ కూడా దేశాయ్‌కు స్వాగతం పలుకుతూ, ఆయనకు పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు.



## శ్రీలంక క్రికెట్‌లో కలకలం.. హోటల్‌లో మహిళల స్నానం వీడియో చిత్రీకరణ.. ఇద్దరు యువ క్రికెటర్ల అరెస్ట్

- శ్రీలంకలో ఇద్దరు అండర్-19 క్రికెటర్ల అరెస్ట్
- మహిళలు స్నానం చేస్తుండగా వీడియో తీశారని ఆరోపణలు
- 5 లక్షల శ్రీలంక రూపాయల పూచీకత్తుపై బెయిల్
- వీడియోలు ఆన్‌లైన్‌లో షేర్ అయ్యాయా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు

**డిడి9 వార్త:**

శ్రీలంక క్రికెట్‌లో ఓ వివాదం కలకలం రేపింది. తాము బస చేసిన హోటల్‌లో మహిళలు స్నానం చేస్తుండగా రహస్యంగా వీడియోలు తీశారనే ఆరోపణలపై శ్రీలంక అండర్19 పురుషుల టీమ్‌కు చెందిన ఇద్దరు క్రికెటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే, ఆ తర్వాత వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. వివరాల్లోకి వెళితే... కొలంబోలోని నరహేన్‌పిటలో ఉన్న ఒక హోటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అదే హోటల్‌లో బస చేస్తున్న కొందరు మహిళలు, తాము బాత్రూమ్‌లో ఉండగా మొబైల్ ఫోన్లతో వీడియో తీస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఈ వారం మొదట్లో పోలీసులు ఆ ఇద్దరు యువ క్రికెటర్లను అదుపులోకి తీసుకున్నారు.

ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో కథనం ప్రకారం వారిని అలుత్కడె మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, ఒక్కొక్కరికి 5 లక్షల శ్రీలంక రూపాయల (సుమారు రూ. 1.48 లక్షలు) వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. తీసిన వీడియోలను ఏవైనా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో పంచుకున్నారా? అనే కోణంలో నరహేన్‌పిట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ నిమిత్తం మే 25న తిరిగి కోర్టుకు హాజరు కావాలని నిందితులను ఆదేశించారు.



# అందుకే సీఈఓలు గోల్ఫ్ ఆడతారు



గోల్ఫ్ కేవలం ఆట మాత్రమే కాదని.. అది ఆడితే క్రమశిక్షణ అలవడుతుందని, ఏకాగ్రత పెరుగుతుందని నటుడు మాధవన్ అన్నారు. తన కెరీర్‌పై ఈ ఆట ఎంతగానో ప్రభావం చూపించిందన్నారు. షూటింగ్ సమయంలో చుట్టూ జనం ఉన్న ప్రాంతాల్లో ఏకాగ్రత కోల్పోకుండా ఉండడానికి ఈ క్రీడ తనకెంతో సహాయపడుతుందని తెలిపారు. ముఖ్యంగా నటనలో, వ్యక్తిగత జీవితంలో నిలకడగా ఉండటానికి గోల్ఫ్ బాగా ఉపయోగపడుతుందన్నారు.

‘‘ప్రపంచంలో మీతో మీరు పోటీపడే ఏకైక ఆట గోల్ఫ్. ఇందులో మరెవరితోనూ పోటీ ఉండదు. ఏకాగ్రతతో ఆడాలి. పర్ఫెక్ట్ షాట్ కొట్టడం పైనే దృష్టిపెట్టాలి. నా కెరీర్‌కు ఈ ఆట ఎంతగానో ఉపయోగపడింది. మొదట్లో అవుట్‌డోర్ షూటింగ్ చేయాలంటే కంగారుపడేవాణ్ని. అవతలి వ్యక్తులు నన్ను చూసి నవ్వుతారని భయపడేవాణ్ని. కానీ, గోల్ఫ్ నాలో ఆ ఆందోళనను పోగొట్టింది. దాని వల్ల వచ్చిన ఏకాగ్రతే ఎలాంటి ప్రదేశంలో నటించినా.. పాత్రలో లీనమవడానికి ఉపయోగపడింది’’ అని మాధవన్ వివరించారు.

ఈ సందర్భంగా ఓ మోటివేషనల్ స్పీకర్ వీడియోను కూడా మాధవన్ తన ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేశారు. ‘‘బిలియనీర్లు, పెద్ద కంపెనీల సీఈఓలకు ఈ ఆటపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. గోల్ఫ్ ఆడేటప్పుడు ఒక వ్యక్తి ఒత్తిడిలో ఎలా స్పందిస్తాడనే విషయం తెలుస్తుంది. ఓటమి ఎదురైనప్పుడు తన తప్పును అంగీకరిస్తాడా.. లేదంటే ఇతరులపై నిందలు వేస్తాడా అనేది ఈ ఆటతో బయటపడుతుంది. దీనివల్ల భావోద్వేగాలు అదుపులో ఉంటాయి’’ అని ఆ స్పీకర్ చెప్పిన విషయాలను మాధవన్ పంచుకున్నారు.

# ఛావా హీరో... ‘మహావతార్’?

గతేడాది ‘ఛావా’ సినిమాలో శంభాజీ మహారాజ్ పాత్రలో థియేటర్లలో రుద్ర తాండవం చేసి బాక్సాఫీస్ వద్ద వసూళ్లతో రికార్డు సృష్టించాడు బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్. ఇప్పుడాయన పరశురాముడిగా మరో శక్తిమంతమైన పాత్రలో తెరపై అదరగొట్టడానికి సన్నద్ధమవుతున్నారు. విక్కీ ప్రధాన పాత్రలో అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘మహావతార్’. తాజాగా ఈ సినిమాని 2027 జనవరిలో పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ‘‘వచ్చే సంవత్సరమంతా ‘మహావతార్’ షూటింగ్‌కే సమయాన్ని కేటాయించనున్నాడు విక్కీ. దీన్ని ఆయన జీవితంలో ఒక్కసారి మాత్రమే వచ్చే ప్రాజెక్ట్‌గా భావిస్తున్నాడు. అందుకు తగ్గట్లే ఇందులోని తన పాత్ర కోసం శారీరకంగా తనని తాను మార్చుకోవడానికి ఆరు నెలలు శిక్షణ తీసుకోబోతున్నాడ’’ని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# ‘ధురంధర్’ తర్వాత ఆదిత్యధర్‌లో మార్పు! యామీ గౌతమ్ ఏమన్నారంటే..

ఆదిత్యధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘ధురంధర్’ ఇండస్ట్రీలో రికార్డులు తిరగరాసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయం ఆదిత్యలో ఎలాంటి మార్పు తీసుకురాలేదని ఆయన భార్య, నటి యామీ గౌతమ్ అన్నారు. సినిమా హిట్ కావడంపై స్పందిస్తూ.. కథ బాగుంటే సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని చెప్పారు. దానికి ‘ధురంధర్’ ఒక ఉదాహరణ అని అన్నారు.

‘‘సినిమా విషయంలో కీలక బాధ్యత దర్శకుడిదేనని నేను నమ్ముతాను. దీని విజయంలో స్క్రిప్ట్‌కే అధిక ప్రాధాన్యం. ఆదరణ పొందాలంటే కథ కచ్చితంగా బాగుండాలి. ‘ధురంధర్’ విజయం కేవలం కొత్త రికార్డుల గురించి మాత్రమే చెప్పడం లేదు. థియేటర్లకు ప్రేక్షకులను తీసుకురావడానికి మనం ఎంతో కష్టపడుతున్న సమయంలో ఈ సినిమా అందరికీ ఒక విషయాన్ని స్పష్టం చేసింది. మంచి చిత్రాలు తీస్తే ఇప్పటికి కూడా థియేటర్ల వద్ద ప్రజలు బారులు తీరతారని చూపింది. మీరు అద్భుతమైన సినిమాలు తీయండి.. మేము చూడడానికి సిద్ధంగా ఉన్నామని ప్రేక్షకులు మరోసారి రుజువు చేశారు’’ అని యామీ గౌతమ్ అన్నారు.

ఈ భారీ విజయం తర్వాత కూడా ఆదిత్య గతంలో ఉన్నట్లే ఉన్నారని యామీ అన్నారు. ‘‘ఈ సక్సెస్ మాలో మార్పు తీసుకురాలేదు. ఆదిత్య ‘ధురంధర్’కు ముందు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. ఈ విజయాల వల్ల ఆయన ప్రవర్తన మారలేదు. ఆయన జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఉన్నాయి. కానీ ఎప్పుడూ ఆయన తన సహనాన్ని కోల్పోలేదు. మా ఇద్దరికీ దేవుడిపై అపారమైన నమ్మకం ఉంది. మంచి చేసే వారికి మంచే జరుగుతుందని నమ్ముతాం. మనకు దక్కాల్సినది కొంచెం ఆలస్యం కావచ్చేమో కానీ, రాసిపెట్టి ఉంటే కచ్చితంగా దక్కుతుంది’’ అని యామీ చెప్పారు.



# ‘కల్కి 2’ షూటింగ్ స్టార్ట్.. రెబలోడు సెట్స్ లో ఎప్పుడు అడుగుపెడుతున్నాడంటే?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ఆయన లైనప్‌లో ఉన్న అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రాల్లో ‘కల్కి 2898 AD’ సీక్వెల్ కూడా ఒకటి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సైన్స్ ఫిక్షన్ వండర్‌కు సంబంధించి తాజాగా అప్డేట్ బయటకు వచ్చింది. ఈ రోజు నుంచి ఈ సినిమా కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుందని ఇందులో ప్రభాస్ కూడా పాల్గొనబోతున్నారని సమాచారం.

గత కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఒక భారీ సెట్‌లో ‘కల్కి 2’ చిత్రీకరణ జరుగుతోంది. కొత్త షెడ్యూల్‌లో ప్రభాస్ పై ఈ నెల 4 నుండి 7 వరకు కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. అయితే మొదటి భాగంలో కర్ణ, భైరవగా రెండు విభిన్న పాత్రల్లో అలరించాడు ప్రభాస్. కానీ సీక్వెల్‌లో మాత్రం మరో సరికొత్త లుక్‌లో కనిపించి ప్రేక్షకులను ఆశ్చర్యపరచనున్నారని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా.. ఈ సీక్వెల్‌లో ప్రభాస్ పాత్ర మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోంది. ఇక వైజయంతి మూవీస్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా తన అద్భుత నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనున్నారు. కమల్ హాసన్ సుప్రీం యాస్కిన్‌గా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో మరింత భయంకరంగా కనిపించనున్నారు. వీరిద్దరికీ, ప్రభాస్‌కు మధ్య వచ్చే సన్నివేశాలు రెండో భాగంలో హైలైట్‌గా నిలవనున్నాయి. ఈ భారీ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తుండగా.. హాలీవుడ్ స్థాయి విజువల్స్, అద్భుతమైన సెట్టింగ్స్‌తో రూపొందుతున్న ‘కల్కి 2’పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ర్యాంపేజ్ షురూ చేసిన అల్లు అర్జున్ ‘రాకా’

పుష్ప సినిమాతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ చిత్రంతో ఆయన మార్కెట్ కేవలం దక్షిణాదికే పరిమితం కాకుండా, నార్త్ ఇండియాలోనూ తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకుంది. ముఖ్యంగా పుష్ప 2 విడుదల సమయంలో బీహార్‌లో నిర్వహించిన గ్రాండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన రెస్పాన్స్ అందరినీ ఆశ్చర్యపోయేలా చేసింది. ఆ తర్వాత బాలీవుడ్‌తో పాటు.. బీహార్‌లోను దుమ్ము దులిపేసింది పుష్ప 2.

దీంతో ప్రస్తుతం అల్లు అర్జున్ నటిస్తున్న రాకా చిత్రానికి అక్కడ భారీ పోటి నెలకొన్నట్టుగా తెలుస్తోంది. డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ‘రాకా’ మూవీపై బాలీవుడ్ ఆడియన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పుష్ప సిరీస్‌తో వచ్చిన ఇమేజ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈ సినిమా హక్కుల కోసం నార్త్ డిస్ట్రిబ్యూటర్లు ఇప్పటి నుంచే క్యూ కడుతున్నారు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, హిందీ బెల్ట్‌లో ఈ సినిమా బిజినెస్ ఓ రేంజ్‌లో జరుగుతుందని అంచనా వేస్తున్నారు. కానీ, బీహార్‌లో మాత్రం ‘రాకా’ చిత్ర హక్కుల కోసం డిస్ట్రిబ్యూటర్ల మధ్య గట్టి పోటీ ఏర్పడిందట. అక్కడి ప్రముఖ పంపిణీదారులు ఈ సినిమా హక్కులను దక్కించుకోవడానికి, భారీ ధర చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు డిస్ట్రిబ్యూటర్లు ఈ విషయమై చిత్ర నిర్మాతలను సంప్రదించినట్లు తెలుస్తోంది. దీంతో.. పుష్ప తరహాలోనే




ఈ సినిమా కూడా నార్త్ ఇండియాలో భారీ వసూళ్లు సాధిస్తుందని ట్రేడ్ వర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి. మరి రాకా ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

# వామ్మో ఒక్క పాట కోసం శృతి హాసన్ అన్ని కోట్లు తీసుకుందా?

కోలీవుడ్ బ్యూటీ శృతి హాసన్ పేరు మార్మోగిపోతోంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ ‘పెద్ది’లో ఆమె స్పెషల్ సాంగ్ చేస్తుందనే వార్త ఇప్పటికే సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. షూటింగ్ లొకేషన్ నుంచి కొన్ని వీడియోలు లీక్ అవ్వడంతో ఈ విషయంపై క్లారిటీ వచ్చేసింది. అయితే ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తున్న విషయం ఏమిటంటే.. ఈ ఒక్క పాట కోసం శృతి అందుకున్న భారీ పారితోషికం. సాధారణంగా శృతి హాసన్ ఒక సినిమాకు హీరోయిన్‌గా చేస్తే దాదాపు రూ. 3 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటుంది. కానీ ‘పెద్ది’ సినిమాలో కేవలం ఒకే ఒక్క పాట కోసం ఆమె ఏకంగా రూ. 3.5 కోట్లు డిమాండ్ చేసిందని, మేకర్స్ కూడా అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. హీరోయిన్‌గా చేస్తే దాదాపు 30 నుంచి 40 రోజుల పాటు కాల్ షీట్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఈ స్పెషల్ సాంగ్ కోసం కేవలం 3 నుంచి 4 రోజులు షూటింగ్ చేస్తే సరిపోతుంది. తక్కువ రోజుల్లోనే హీరోయిన్ రెమ్యునరేషన్ కంటే ఎక్కువ సంపాదిస్తుండటంతో నెటిజన్లు నోరెళ్లబెడుతున్నారు.

ఇటీవల కాలంలో స్టార్ హీరోయిన్లు స్పెషల్ సాంగ్స్ కోసం భారీగా ఛార్జ్ చేస్తున్నారు. ‘స్త్రీ 2’లో తమన్నా, ‘కూలీ’ సినిమాలో పూజా హెగ్డే ఒక్కో పాటకు రూ. 3 కోట్లు తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు శృతి హాసన్ వారిని కూడా దాటేసి రూ. 3.5 కోట్లు తీసుకోవడం సినీ సర్కిల్స్‌లో చర్చనీయాంశమైంది. రామ్ చరణ్ సరసన గతంలో ‘ఎవడు’ సినిమాలో హీరోయిన్‌గా నటించిన శృతి, చాలా కాలం తర్వాత మళ్ళీ ఆయన పక్కన మాస్ స్టెప్పులు వేయబోతోంది. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆయన కంపోజ్ చేసిన ఊర మాస్ ట్యూన్‌కు రామ్ చరణ్ గ్రేస్, శృతి హాసన్ ఎనర్జీ తోడైతే థియేటర్లు దద్దరిల్లడం ఖాయమని చిత్రబృందం నమ్మకంగా ఉంది. ఈ పాట సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని టాక్. తక్కువ పనికే ఎక్కువ లాభం ఉండటంతో శృతి హాసన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.



# ‘కందుల సులోచన రాణి’గా.. అనుపమ..

టాలీవుడ్ వెర్సటైల్ హీరో శర్వానంద్, మాస్ డైరెక్టర్ సంపత్ నంది కలయికలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘భోగి’. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుండే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పక్కా మాస్ అంశాలతో కూడిన ఈ చిత్రంలో శర్వానంద్ మునుపెన్నడూ చూడని డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తుండగా నారి నారి నడుమ మురారి, బైకర్ వంటి సినిమాలతో జోరుమీదున్న శర్వా భోగి సినిమా షూటింగ్ ను చక చక ఫినిష్ చేస్తున్నాడు.

తాజాగా ఈ సినిమా నుండి మరో కీలకమైన అప్‌డేట్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న అనుపమ పరమేశ్వరన్ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ‘కందుల సులోచన రాణి’ అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తోంది అనుపమ. పోస్టర్‌లో అనుపమ లుక్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండటంతో పాటు, రా అండ్ రస్టిక్ గా సినిమాలో చాలా కీలకంగా ఉండబోతోందని స్పష్టమవుతోంది. సంపత్ నంది తన సినిమాల్లో హీరోయిన్ల పాత్రలను కూడా చాలా బలంగా డిజైన్ చేస్తాడనే పేరుంది. అదే తరహాలో సులోచన రాణి పాత్ర కూడా ఉండబోతోన్నట్టు పోస్టర్ చూస్తే తెలుస్తుంది. శర్వానంద్ కెరీర్‌లో ఇది వన్ ఆఫ్ ది హై బడ్జెట్ మూవీగా తెలుస్తోంది. సంపత్ నంది తనదైన శైలిలో కమర్షియల్ హంగులతో పాటు హైవోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమాలో ప్లాన్ చేశారు. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్ లో కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.



# సర్‌ప్రైజ్‌లను వెండితెరపైనే చూసేందుకు వేచి ఉండండి..

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘కింగ్’. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం సౌత్ ఆఫ్రికాలోని కేప్ టౌన్‌లో జరుగుతోంది. అయితే అక్కడ ఒక పాటను చిత్రీకరిస్తుండగా తీసిన కొన్ని ఫోటోలు ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారాయి. ఇందులో షారుఖ్ ఖాన్, దీపికా పదుకొణె చేతులు పట్టుకుని నడుస్తూ కనిపిస్తున్నారు. దీపికా ఫ్లోరల్ ప్రింట్ గౌనులో మెరిసిపోతుండగా, షారుఖ్ మాత్రం పైన బటన్స్ పెట్టుకోకుండా, సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. సెట్స్ నుంచి ఈ ఫోటోలు, వీడియోలు లీక్ అవ్వడం ఇప్పుడు ఇండస్ట్రీలో పెద్ద కలకలం రేపుతోంది. వాటిని చూసిన ఫ్యాన్స్ ఇదొక పెయింటింగ్ లా ఉందని కొందరు అంటుంటే.. జవాన్, పఠాన్ సినిమాల కంటే షారుఖ్ లుక్ ఇందులో ఇంకా బాగుందని మరికొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా, ఈ విషయంపై దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ట్విట్టర్ ద్వారా స్పందించి తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి లీక్డ్ మెటీరియల్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని ఆయన అభిమానులకు విజ్ఞప్తి చేశారు. "అభిమానులందరికీ ఒక విన్నపం.. దయచేసి ‘కింగ్’ సెట్స్ నుంచి లీక్ అయిన ఏ ఫోటోను లేదా వీడియోను సర్క్యులేట్ చేయకండి. మీకు ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని అందించడం కోసం మా టీమ్ రాత్రింబవళ్లు కష్టపడుతోంది. ఆ సర్‌ప్రైజ్‌లను వెండితెరపైనే చూడాలి. మేం అనుకున్న విధంగానే ప్రమోషన్స్ ద్వారా వాటిని రివీల్ చేసే వరకు అందరూ సహకరించండి" అని కోరారు.ఈ సినిమాలో షారుఖ్, దీపికాలతో పాటు ఆయన కుమార్తె సుహానా ఖాన్, రాణి ముఖర్జీ, అభిషేక్ బచ్చన్, అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్టైనర్ డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా థియేటర్లలోకి రానుంది. షారుఖ్, సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి.

